ఉత్సాహంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర -తాళ్లూరు: ఎబీసీ ఉన్నత పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయాధికారి, దైవ వాక్యబోధకులు బి.ప్రసాద రావు, అమెరికా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫేసర్ డాక్టర్ డానియేల్ వెంకట్‌లు దైవ వాక్యాన్ని అందించారు. ప్రేమ, కరుణ, దయతో ఏసయ్య ప్రపంచాన్ని జయించారని చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన నాటి నుండి దైవ బాటలో నడవాలని కోరారు. కరస్పాండెంట్ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, డైరెక్టర్ కాలేషా బాబులు దైవ సహాయకులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు స్వరూపారాణి, చిన్నయ్య, సుష్మిత , ఫాణి, రామలక్ష్మిలు దైవ ప్రార్ధన చేసారు. ఫాస్టర్స్‌ను ఘనంగా సన్మానించారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ మొబైల్ ఫోన్లు పంపిణీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం 199 మంది అంగన్వాడీ కార్యకర్తలకు 5జీ మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, కంబం మార్కెట్ యార్డు చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, జడ్పీటీసీ బి.వెంకట రాజయ్య, అంగన్వాడీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కోసమే ఉపాధి హామీ చట్టంలో మార్పు

- ఏకపక్షంగా పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం
- బీజేపీ పాలనలో ఉపాధి హామీ పథకానికి తూట్లు
- 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు డిపాజిట్ చేయమనడం దుర్మార్గం
- ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో కార్పొరేట్లకు బీజేపీ ఊడిగం
- ఉపాధి హామీ చట్టాన్ని స్కీంగా మార్చారు
- మారిన చట్టంతో గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలు మరింత దుర్భరం
- ఉపాధి హామీ చట్టంలో గాంధీపేరు తొలగించడం రాజకీయ కుట్రకోణం
- చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి
- కలెక్టర్ వద్ద నిరసనలో వామపక్ష నేతల డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : కార్పొరేట్ కోసమే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంలో మార్పులు చేసిందని, దీనిని యథావిధిగా కొనసాగించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంకు నిరసనగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.వెంకట్రావు అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. ప్రతి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కోత విధిస్తూనే ఉందని అన్నారు. యూపీఏ-1 ప్రభుత్వ హయాం కాలంలో వామపక్ష పార్టీల డిమాండ్ మేరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని అన్నారు. పనిచూపించలేని పక్షంలో తిండిపెట్టేందుకు చొరవ చూపిందని అన్నారు. దీని కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులు చిన్న, సన్నకారు రైతులు పేదల జీవితాల్లో పెనుమార్పులు వచ్చాయని అన్నారు. వలసలు తగ్గాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని అన్నారు. గతంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పది శాతం ఇస్తే 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేదని అన్నారు. అయితే ఆ కొద్దిశాతం కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వలేని స్థితిలో ఉన్న కారణంగా కొన్ని రాష్ట్రాల్లో పథకం అమలు నత్తనడకగా నిలిచిందని అన్నారు. వంద రోజుల పని కూడా చూపించలేదని అన్నారు. అయితే ఈ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మార్పులు చేసి 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా డిపాజిట్ చేయాలని పేర్కొనడం చట్టాన్ని నిర్వీర్యం చేయడానికేనని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం అమలులో నాటి నుంచి నేటి వరకు దేశవ్యాపితంగా దాదాపు 9 లక్షల కోట్ల పనులు జరిగాయని అన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఎస్‌పి కాలువలు, చెరువులు, రోడ్లు, కుంటలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతోకొంత మెరుగైన జీవనాన్ని అనుభవించారని అన్నారు. వలసలు తగ్గాయని అన్నారు. పనులు లేని సమయాల్లో గ్రామీణ ప్రాంత సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ పనులకు వెళ్లేవారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు కూలీలకు మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. రైతులపై ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి వారిఆత్మహత్యలు నివారించాలని సూచించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి చరిత్రలేని బీజేపీ దానిని ప్రజలు మరిచిపోయేలా చేసేందుకు గాంధీ పేరును తొలగించిందని అన్నారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ గాంధీని చంపిన గాడ్సే వారసులని ప్రజలందరికీ తెలుసని అన్నారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎస్ స్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కొల్ల గొడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చ ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు , సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసులు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, కొత్తకోట వెంకటేశ్వర్లు, నల్లూరి మురళి, ఎం.విజయ, ఆర్ లక్ష్మి, ఆర్ కరుణానిధి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జీవీ రామారావు, దాసరి అంజయ్య, జూపల్లి కోటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శులు టి ప్రభాకర్, ముత్తన అంజయ్య, సలార్, బాలాజీరెడ్డి, కట్టా ఆంజనేయులు, సీపీఎం నాయకులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, పమిడి వెంకటరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎస్ లలితకుమారి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆన్‌లైన్ తొలగించి న్యాయం చేయాలంటూ సబ్ కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-అర్ధవీడు : ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం తోకపల్లి ఇలాకాలో గల సర్వేనెంబర్ 3/1ఎ1లో 54 సెంట్లకు సంబంధించిన, తమ భూములను అధికారుల అండదండలతో మండల నాయకుడిగా ఉన్న దుగ్గెంపూడి కొండారెడ్డి తన తండ్రి పేరు మీద నమోదు చేసుకున్న అక్రమ ఆన్‌లైన్‌ను తొలగించి న్యాయం చేయాలని దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నందు ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల తహశీల్దారు కార్యాలయం చుట్టు కాళ్లు రిగేలా తిరుగుతున్నప్పటికీ అధికారులు మండల నాయకుడుతో కుమ్మక్కై తమకు న్యాయం చేయడం లేదని సబ్‌కలెక్టర్‌ను వేడుకున్నారు. ఇప్పటికైనా తమరు అక్రమ ఆన్‌లైన్ తొలగించి మాకు న్యాయం చేయాలని పిచ్చిరెడ్డి సబ్ కలెక్టర్‌ను కోరారు.

హమాలీ వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-దర్శి : హమాలివర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఆదివారం జరిగిన మహాసభలో ఈ కమిటీని ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు తెలిపారు. అధ్యక్షులుగా బిజ్జాల శ్రీను, ఉపాధ్యక్షులుగా మారెడ్డి చెన్నయ్య, పి.నాగేష్, గుడిపాటి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా వెంకటరావు, శ్రీను, సహాయ కార్యదర్శులుగా ఆవుల చిన్న భిక్షాలు, గుర్రపుశాల బాలరాజు, ఆదినారాయణరెడ్డి, ట్రెజరర్‌గా జక్కా బుచ్చయ్యలను మరో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు కె.హనుమంతరావు ప్రకటించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు బిజ్జాల శ్రీను మాట్లాడుతూ మాపై నమ్మకంతో మమ్ములను ఎన్నుకున్న ముఠా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, హక్కుల కోసం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఏపి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ మేరీమేరీ క్రిస్మస్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రఘు, శ్రీలత, శాంతకుమారి, మండల నోడల్ పర్సన్ శ్రీనివాసులరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంకు ద్వారా పొదుపు సంఘాలకు అధిక మొత్తంలో రుణాలు

- బ్యాంకు మెనేజర్ వెంకట రెడ్డి

విశాలాంధ్ర -తాళ్లూరు: యూనియన్ బ్యాంకు ద్వారా పొదుపు సంఘాలకు అధిక మొత్తంలో రుణాలు అందించటానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు బ్యాంకు మెనేజర్ వెంకట రెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం పొదుపు సంఘ వీఓఏతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెనేజర్ వెంకట రెడ్డి మాట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లించి మరలా పొంది రుణ పరపతిని పెంచుకోవాలని కోరారు. ఏపీఎం దేవరాజ్ మాట్లాడుతూ గ్రామ సంఘాలకు రెండు సీఆర్‌పి లను నియమిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 27న క్లస్టర్ మీటింగ్ ఉన్నందున అనిన పథకాలపై సమీక్ష నిర్వహించి నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

వైఎస్ జగన్‌కు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

ఎంపీపీ గాయం సావిత్రి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఉందని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. మండల కేంద్రమైన హనుమంతునిపాడు వైసీపీ కార్యాలయంలో జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను ఎంపీపీ గాయం సావిత్రి మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసరెడ్డిలు కట్‌చేసి జగన్మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షులు శ్యామల సాంబిరెడ్డి, వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు బేబి, తదితరులు పాల్గొన్నారు.

హోటల్ మౌంట్ రాయల్‌ను ప్రారంభించిన కదిరి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండలంలోని ముప్పాళ్లపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దిరిశనం పిచ్చిరెడ్డి కంది మాలకొండారెడ్డి, కుందూరు నారాయణరెడ్డిలు భాగస్వామ్యంతో హైదరాబాదులోని కూకట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన హోటల్ మౌంట్ రాయల్‌ను సోమవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరిబాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి జరిగి అంచలంచెలుగా నిర్వాహకులు ఎదగాలని ఆశీర్వదించి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు కదిరి బాబురావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి లక్ష్మిరెడ్డి, ఎస్ నరసారెడ్డి, వెంకటరెడ్డి, చిట్యాల ఆదినారాయణ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాస స్థల పట్టాల కోసం నిరసన

విశాలాంధ్ర-అర్ధవీడు : మార్కాపురం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నందు జై జవాన్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాస స్థలము పట్టాల కోసం సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జై జవాన్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం హరినారాయనరెడ్డి, హౌసింగ్‌బోర్డు సొసైటీ అధ్యక్షులు చిన్నయ్య మాట్లాడుతూ రిటైర్డ్ అయిన సైనికులకు సైనిక్ కాలనీ ఏర్పాటు చేయాలని పలుమార్లు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. గవర్నమెంట్ జీవో పాస్ చేసినా ఆ జీవోకు విలువ లేకుండా పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గవర్నమెంట్ జీవో ప్రకారం ఇంటి స్థలం కొరకు 175 గజాలు మాజీ సైనికులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామకృష్ణ, సహాయ కార్యదర్శి తిరుపతిరెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, బాదుల్లా, కృష్ణయ్య తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

వాసవిక్లబ్ జిల్లా గవర్నర్‌గా సూరే సురేంద్ర

విశాలాంధ్ర-అర్ధవీడు : వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వి207ఏ జిల్లా గవర్నర్‌గా సూరే సురేంద్ర 2026 సంవత్సరమునకు గాను వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్గా ప్రమాణస్వీకారంలలో భాగంగా సోమవారం హైదరాబాద్ శంషాబాద్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన ఐకాన్ 2025లో వారి ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026వ సంవత్సరానికి సంబంధించిన జిల్లాలోని అన్ని క్లబ్బుల 1010 ఫార్మ్ విజయవంతంగా పూర్తి చేసినందుకు ఇది తొలి ప్రధాన విజయవంగా ఫస్ట్ టాస్క్ పూర్తయిందని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ 32 జిల్లాలకు గాను మన జిల్లాను ప్రత్యేకంగా గుర్తించి ఐకాన్ వేదికపై సిల్వర్ కప్పును ప్రత్యేక బహుమతిని గవర్నర్‌కు అందజేయడం జరిగింది. ఈ ఘనత సూరే సురేంద్ర అంకితభావానికి నాయకత్వ సామర్ధ్యానికి అలాగే వాసవిక్లబ్ నిదర్శనంగా నిలిచిందని వాసవిక్లబ్ సభ్యులు అభిప్రాయ పడ్డారు.

మార్కాపురం జిల్లాను ప్రకటనతో కృతజ్ఞత సభ

విశాలాంధ్ర-అర్ధవీడు : మార్కాపురం జిల్లాను ప్రకటించిన సందర్భంగా మార్కాపురం పట్టణంలోని 7వ వార్డు నందు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌లు హాజరయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, తెలుగుదేశం నాయకులు ఎన్డీఏ కూటమి నాయకులు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు మెగా క్రిస్మస్ క్యారల్స్

విశాలాంధ్ర-అర్ధవీడు : మార్కాపురం పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ మెగా క్యారల్స్ మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఎస్వీకేపీ కళాశాల వద్ద నుండి పూలసుబ్బయ్య కాలనీ వరకు ఈ మెగా కేరల్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు కె.జాన్ వినయ్‌కుమార్, టీఎస్ జైపాల్, బాబు ప్రసాద్, శ్యాం ప్రకాష్, విజయ్‌కుమార్, ప్రభుదాస్, సతీష్, బాబిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కన్వీనర్లు కోరారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బూచేపల్లి

విశాలాంధ్ర-దొనకొండ: వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా మండల అధ్యక్షులు యనుబరి మనోహర్ రాజు వివాహ వేడుకలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా సోమవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు పూలాభిషేకం, బాణా సంచా నడుమ ఘన స్వాగతం పలికారు. నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, బత్తుల వెంకటసుబ్బయ్య, విప్పర్ల సుబ్బయ్య, గొంగటి పోలిరెడ్డి, పులిమి శివ, కిన్నెర ప్రసాద్, వినుకొండ కొండలరావు, చీరాల ఇశ్రాయేల్, వల్లపునేని వీరాచారి, కె.హర్షవర్ధనరెడ్డి, వెర్రి అంజిరెడ్డి ఉన్నారు

ఘనంగా రామానుజన్ జయంతి

విశాలాంధ్ర-తాళ్లూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో సోమవారం గణిత మేధావి రామానేజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లూరు ఎబీసీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ టి.శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె వెంకటేశ్వర రావు సర్ శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. డైరెక్టర్ కాలేషా బాబు మాట్లాడుతూ మ్యాథ్స్‌లో పట్టు సాధిస్తే ఇతర సబ్జెక్టు సులభతరంగా ఉంటాయని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి అమెరికా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫేసర్ డాక్టర్ డానియేల్ వెంకట్ మాట్లాడుతూ తాను పాఠశాలకు వచ్చిన సమయంలో చాలా అల్లరి చిల్లరిగా ఉన్నానని, మ్యాథ్స్ సార్ వెంకటేశ్వర రావు ఎంతో చక్కగా బోధించి మ్యాథ్స్‌లో వందకు వంద మార్కులు తెప్పించారని, తర్వాత తాను జీవితంలో విజయం సాధన దిశగా అడుగులు వేసిన వైనాన్ని తనకు సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెప్పారు. మాథ్స్ ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు,వెంకట రావులను ఘనంగా సన్మానించారు. మాథ్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

సెంటినరి తెలుగ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర-పొదిలి : ఖపొదిలి పట్టణంలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు యూత్ సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకొని చర్చికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం రాత్రి యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్‌ను పాస్టర్లు రెవరెండ్ టి.జాన్ విక్టర్ సహాయ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ డి.సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్, స్టాండింగ్ కమిటీ, ప్రోగ్రాం కమిటీ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రార్ధనలు నిర్వహించారు. రాత్రికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న ఆరు మండలాల స్థాయిలో క్రిస్టియన్ పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళవారం సండేస్కూల్ పిల్లలకు క్రిస్మస్ కార్యక్రమాలు జరుగుతాయి. బుధవారం రాత్రి క్యాండిల్‌లైట్ సర్వీస్, కేక్ కటింగ్ కార్యక్రమం జరగనుంది. చర్చి ఆవరణలో యూత్ ఏర్పాటు చేసిన పశు వులపాక, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ స్టార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 25 గురువారం ప్రత్యేక ప్రార్ధనలు రాత్రికి చిన్న పిల్లలు యూత్ పెద్దల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. అందరినీ ప్రేమపూర్వకంగా ఆహ్వానిస్తున్నట్లు పాస్టర్లు ఎగ్జిక్యూటివ్, స్టాండింగ్ కమిటీ, ప్రోగ్రాం కమిటీ సభ్యులు తెలిపారు.

బాలికలకు నైతిక విలువలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-మార్కాపురం : పట్టణంలోని నాగులవరం రోడ్డులో గల గిరిజన బాలికల పాఠశాలలో సోమవారం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య రక్షణ మరియు నైతిక విలువలపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు వహిస్తూ విద్యను అభ్యసించడంతో పాటు గురువులు, తల్లిదండ్రుల పట్ల గౌరవ భావం, భక్తి శ్రద్ధలతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. నారాయణ లావణ్య మాట్లాడుతూ మానసిక ఉత్సాహంతోనే మెదడును వృద్ధి చేసుకోవచ్చని, మనసు ప్రశాంతంగా ఉంటే చదువును కూడా బాగా అభ్యసించవచ్చని అన్నారు. డెంటల్ వైద్యురాలు గుంటక నాగసౌమ్యరెడ్డి మాట్లాడుతూ దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి అన్నా రాము, కోశాధికారి శ్రీనివాసరావు, ఆర్‌కెజె నరసింహం, గంగిశెట్టి కిరణ్‌కుమార్, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

దొనకొండను మార్కాపురం జిల్లాలో కలపాలి

సీపీఐ మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి

విశాలాంధ్ర-దొనకొండ: దొనకొండ మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలంటూ సీపీఐ మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి కోరారు. మండలంలోని పలు గ్రామాల నుండి సుమారు 200 పైగా వినతి పత్రాల రూపంలో తహసీల్దార్ బి.రమాదేవికి సోమవారం అందజేశారు. మార్కాపురం మండలానికి ఆనుకుని ఉన్న దొనకొండ మండలాన్ని సుమారు 90 కిమీ దూరంలో గల ఒంగోలులో కొనసాగించటం ద్వారా వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదంటూ వాపోయారు. ప్రజల నుండి వచ్చిన వినతి పత్రాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి బుక్కారపు జయరాజ్, విశ్వభారతీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మల్లెల రామిరెడ్డి, బంగారు వ్యాపారి మాడిశెట్టి రమేష్, సీపీఐ నాయకులు కూరేటి బాలయ్య, బచ్చలకూరి మరియదాసు, నూనె సుధీర్, గుంటు ఆశీర్వాదం, విడుదల ఆశీర్వాదం తదితరులున్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు వినతి

విశాలాంధ్ర-అర్ధవీడు : కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల 28వ తేదీన జరుగు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మార్కాపురం మునిసిపల్ కమిషనర్‌కి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబుబ్‌వలి మాట్లాడుతూ కాంగ్రెస్ స్వాతంత్రం కోసం పుట్టిన పార్టీ, ఇది భారతదేశ రాజకీయ పార్టీల్లో అతి పురాతనమైన పార్టీ, స్వాతంత్రం అనంతరం భారతదేశాన్ని 50 సంవత్సరాలకు పైగా పరిపాలించగా మన మార్కాపురం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ దిమ్మె ఎక్కడా లేనందున మాకు కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా పండుగ చేసుకోవడానికి ఒక దిమ్మెను ఏర్పాటు చేసుకోవడానికి స్థలాన్ని కేటాయించవలసిందిగా మార్కాపురం పట్టణ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

శ్రీనివాసరామానుజన్ జయంతి

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలం తూర్పు వీరాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ 137వ జయంతి పాఠశాల ఉపాధ్యాయులు విట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. రామానుజన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఉపాధ్యాయులు కలిసి పూలమాలలు వేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో శాస్త్రవేత్తగా ఎదిగిన ప్రముఖులలో శ్రీనివాస రామానుజన్ ఒకరని, ఆయన పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారని అంచలంచెలుగా ఎదిగి మంచి శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి స్వామిని కలిసిని 'ఉగ్ర'

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని తూర్పునాయుడు పాలెంలో మంత్రి డీఎస్‌బీవీ స్వామిని నూతనంగా జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉగ్ర నరసింహారెడ్డిని శాలువాతో మంత్రి సత్కరించి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-టంగుటూరు : జాతీయ గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వి సుధారాణి అధ్యక్షతన గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాల అలంకరించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల లెక్కల ఉపాధ్యాయురాలు టీఎల్ సరస్వతి విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.మాధురి నిర్మల ఉమాదేవి నాసర్‌వలి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండలంలోని మహ్మదాపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యా శాఖాధికారి రాముల రమణయ్య గణిత గొప్పతనాన్ని తెలియచేసి పాఠశాల ఉపాధ్యాయులకు

ఉపాధ్యాయేతర సిబ్బందికి విద్యార్థులకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వకృత్వ వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు గణిత ప్రదర్శన వంటివి చూపరులను ఆకర్షించాయి. ప్రధానోపాధ్యాయులు ఓరే రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-పామూరు : భూ సమస్యలను పరిష్కరించా లని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం, మిట్టపాలెం ఉమ్మడి రెవెన్యూ పరిధిలో గత 20 సంవత్సరాలుగా స్థానికేతరుల పట్టాలు రద్దు చేయాలని పోరాటం కొనసాగుతుందని అన్నారు. సర్వేనెంబర్ 60లో 54 మందికి చెందిన 2.30 ఎకరాల బోగస్ పట్టాలు రద్దు పరిచి స్థానిక భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని ఉద్యమం కొనసాగిస్తున్నట్లు ఆయన అన్నారు.

పరిమితికి మించి ఎక్కించుకుంటే కేసు నమోదు

– సీఐ హజరత్తయ్య

విశాలాంధ్ర-జరుగుమల్లి : ఆటోలు, ట్రాక్టర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కించుకుని వెళితే వారిపై కేసు నమోదు చేస్తామని సీఐ హజరత్తయ్య హెచ్చరించారు. వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద ట్రాక్టర్ డ్రైవర్లకు ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పద్ధతి మార్చుకొని పరిమితికి మించి కూలీలు ఎక్కించరాదని ప్రాణం విలువైందని ప్రాణం పోతే రాదన్నారు. ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రూల్స్ పాటించాలన్నారు. ఎవరైనా రూల్స్ పాటించకుంటే వారిపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని సూచించారు. ఈయన వెంట ఎస్‌ఐ మహేంద్ర పోలీసు సిబ్బంది ఉన్నారు.

శరవేగంగా సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు

విశాలాంధ్ర-జరుగుమల్లి : మండల పరిధిలోని తూమాడు గ్రామంలో 13 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్ షేక్ షరీఫ్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ టీడీపీ నాయకుడు తోక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మురుగు కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

ప్రజల గుండె చప్పుడు జగన్

విశాలాంధ్ర-జరుగుమల్లి : పల్లె సీమలలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల గుండె చప్పుడుగా జనహృదయనేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రమైన జరుగుమల్లిలోని వైయస్‌ఆర్ విగ్రహం వద్ద జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ ఫలాలు అందించి వారి హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించిన ఏకైక నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్నారు.

అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్‌లు అందజేత

విశాలాంధ్ర-జరుగుమల్లి : అంగన్వాడి కార్యకర్తలకు ప్రభుత్వం మంజూరు చేసిన 5జి స్మార్ట్ ఫోన్లను జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లం నిర్మల, మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ అందజేశారు. ఎంపీపీ నిర్మల మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామమూర్తి, సూపర్‌వైజర్‌లు విజయ, భారతి తదితరులు పాల్గొన్నారు.

24న పీఏసీఎస్ పెట్రోల్ బంక్ ప్రారంభం

విశాలాంధ్ర - హనుమంతునిపాడు: పామూరు మండలం వగ్గంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును కనిగిరి సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని పామూరు పిఏసిఎస్ చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిఏసిఎస్ చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, డైరెక్టర్ యలమందల రహీముల్లాలు ఒక ప్రకటనలో కోరారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ జయచంద్ర

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని పశు వైద్యాధికారి డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయచంద్ర ఆధ్వర్యంలో ప్రారంభించి, రైతులకు శాస్త్రీయమైన పశు పోషణ, ముందస్తు వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యత, నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులు, వాటి చికిత్స మొదలగు అంశాలపై రైతులకు సింగరాయకొండ పశు వైద్యాధికారి డాక్టర్ హజరత్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గేదెలకు సెక్స్ సార్టెడ్ సెమన్ ద్వారా గర్భధారణ చేయించడం వల్ల కేవలం ఆడదూడలు మాత్రమే పుడతాయని తెలియజేశారు. అధిక పాల దిగుబడికి పాడి పశువులకు మేతతో పాటు దాణ మరియు ఖనిజలవణాల మిశ్రమాన్ని తప్పకుండా అందించాలని పాడి రైతులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల్లో భాగంగా రాయితీపై గడ్డిజొన్న విత్తనాలు, పశు దానాలు అందిస్తుందని తెలిపారు. ఈ శిబిరంలో 26 గేదెలకు చూడి పరీక్షలు,30 ఎదకు రానటువంటి గేదెలుకు మరియు 20 గర్భకోశ వ్యాధి గేదెలకు చికిత్స చేసి, 29 దూడలకు, 425 గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాకల, సింగరాయకొండ పశు వైద్యులు డాక్టర్ పేరయ్య, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు, పాల్గొన్నారు.

బట్టరుశెట్టి లక్ష్మమ్మకు నివాళులర్పించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని తూర్పుకట్టకింద పల్లి గ్రామానికి చెందిన బట్టరశెట్టి లచ్చుమ్మ వృద్ధాప్యంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైసిపి మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, వైసిపి ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షులు కల్లూరి రామిరెడ్డి, జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, గట్ల విజయ భాస్కర్ రెడ్డి, నీరుకట్టు కొండలరావు, పాలేటి ప్రేమ్ తదితరులు లక్ష్మమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో ఘన నివాళు లు అర్పించారు. ఆమె కుమారులు బట్టరుశెట్టి ఆచార్యులు, బట్టరుశెట్టి వెంకట ప్రసాద్‌లను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర- వెలిగండ్ల: విజయనగరం జిల్లా నీలిమల్ల నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బడిగొండ అప్పలనాయుడు ఆ ప్రాంతంలో వెలిగండ్ల మండలం బల్లవరం గ్రామానికి చెందిన సైకం తిరుపతిరెడ్డి ఆర్ఎంపీగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం స్వగ్రామైన బల్లవరంలో శర్మనికి విచ్చేసి నివాళులర్పించిన అనంతరం వైఎస్ఆర్సిపి బల్లవరం నాయకులు చిలకల నారాయణరెడ్డితో కొంతసేపు వైసిపి నియోజకవర్గ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కత్తిర వెంకటేశ్వర్ రెడ్డి, సిహెచ్ ప్రకాశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నైలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-సిఎస్ పురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా చెన్నై మహానగరంలో షోలింగ్ నెల్లూరులోని ఫాతిమా అనాధాశ్రమంలో వైయస్సార్ ఐటీవీ, అభిమానులు ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి వృద్ధులు వికలాంగులు చిన్న పిల్లలకి పండ్లు పంపిణీ చేయడం జరిగినది అదేవిధంగా జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా బ్రేక్ ఫాస్ట్ పంపిణీ చేయడం జరిగినది అదేవిధంగా నావులూరు వైయస్సార్ అభిమానులు కుర్చీలు డొనేట్ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో మితికేల వరుణ్ కుమార్ పులి రామచంద్రారెడ్డి పులి మాల్యాద్రి రెడ్డి గంటా త్రివేణి రెడ్డి అశోక్ రెడ్డి రామిరెడ్డి గురవయ్య గుమ్మా మురళి లాకా శ్రీనివాసులు పిన్నిక కృష్ణ విజయభాస్కర్ రెడ్డి చెవుల రమేష్ ఎస్పీ రెడ్డి డాన్ శీను పుల్లారెడ్డి తదితరులు పాల్గొనడం జరిగినది.

ప్రజల మనసుల్లో జగన్‌కు సుస్థిరస్థానం

విశాలాంధ్ర-సిఎస్ పురం : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేశంలో ఆదర్శవంతమైన పాలన అందించి పెదప్రజల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం బెంగళూరులోని ఎస్ఎస్ లేఅవుట్. సజ్జపూర్‌లో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రక్తదాన శిబిరం నిర్వహించి అనంతరంకేక్ కట్ చేసి జగన్మోహన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాలు అమలు చేసి పెదప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డి దక్కుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అని చెప్పి ప్రజలకు మోసం చేసిన చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానిదని విమర్శించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడపు రెడ్డి రమణారెడ్డి నాగిరెడ్డి తిరుమల్ రెడ్డి శివారెడ్డి రామిరెడ్డి వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా గణిత ప్రదర్శన

విశాలాంధ్ర - తర్లుపాడు : శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం తర్లుపాడు మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత విభాగానికి సంబంధించిన ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రత్యేకంగా బోధనోపకరణాలను తయారు చేయించి, గణిత ప్రదర్శనను ఆకర్షణీయంగా నిర్వహించారు. కృత్యాల ద్వారా సంక్లిష్టమైన గణిత భావనలను సులభంగా నేర్చుకునే పద్ధతులను విద్యార్థులు వారు స్వయంగా తయారు చేసిన ఉపకరణాలతో విశదీకరించారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను ఆయన గణితానికి చేసిన సేవలను విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు కే.ప్రదీప్ కుమార్, డి.వెంకటేశ్వర్ రెడ్డి వివరించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి గణిత ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మక శక్తిని, ఊహాశక్తిని పెంపొందింపజేసి, సంక్లిష్టమైన గణిత భావనలను సులభంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండల కేంద్రమైన దోర్నాలలోని శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు హాస్పిటల్ అధినేత వైద్యులు డాక్టర్ కాశి రావు, డిఎమ్ఓ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, హాస్పిటల్ నర్సులు, సిబ్బందికి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యులు కాశి రావు మాట్లాడుతూ పండుగలు మన మధ్య పరస్పర ప్రేమ, ఐక్యత, మానవతా విలువలను మరింత బలపరుస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే లైసెన్సులు రద్దు

వ్యవసాయ అధికారి దేవిరెడ్డి హెచ్చరిక

విశాలాంధ్ర - పొదిలి : మండలంలోని ఎరువుల వ్యాపారుల తీరుపై వ్యవసాయ శాఖ నిఘా ముమ్మరం చేసింది. సోమవారం పొదిలిలోని పలు ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, వ్యాపారులకు పలు కీలక సూచనలు చూసించారు. అనంతరం ఆయన దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, గోదాముల్లో ఉన్న నిల్వలను ఆయన క్షుణ్ణంగా సరిపోల్చారు. కాగితాల్లో ఉన్న నిల్వకు, ప్రత్యక్షంగా ఉన్న నిల్వకు తేడా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల సౌకర్యార్థం ప్రతిరోజూ దుకాణం వెలుపల స్టాక్ బోర్డును ఏర్పాటు చేయాలని, అందులో ఏ రకమైన ఎరువులు ఎంత పరిమాణంలో ఉన్నాయో స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట విక్రయ ధర కంటే ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా సహించేది లేదని స్పష్టం చేశారు. నిల్వలు ఉన్నప్పటికీ లేవని చెప్పి కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏవో దేవి రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలతో పాటు సదరు దుకాణాల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతులకు సాగు సీజన్‌లో ఎరువుల ఇబ్బంది కలగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగింపు అన్యాయం

సీపీఐ, కాంగ్రెస్ ఆందోళన

విశాలాంధ్ర-మార్కాపురం : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వికసిత్ భారత్ జి.రామ్‌జిగా మార్చడం దేశ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఎస్‌కె కాశిం ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి ఆకస్మికంగా గాంధీపేరు తొలగించడం పట్ల ఆ మహనీయునిపై బీజేపీకి ఎంత శ్రద్ధ ఉందో స్పష్టంగా అర్థమవుతుందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అహింసామార్గంలో పెద్ద ఎత్తున పోరాటం చేసిన మహాత్మాగాంధీ పేరును ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు. బీజేపీ ఒక పథకం ప్రకారం మహాత్మాగాంధీ పేరును అణిచివేయాలని కుట్ర పన్నుతుందని అందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి ఆయన పేరును తొలగించడం జరిగిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలు పేదలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంతో లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయిస్తుండగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వాలని చెప్పడం ఈ పథకాన్ని నీరుగార్చే ఉద్దేశంతోనే కుట్ర పన్నుతుందని ఎన్డీఏ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా దుయ్యబట్టారు. గత ఏడు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర, రాష్ట్ర చట్టాలకు, వివిధ ప్రఖ్యాత నగరాలకు బీజేపీకి ఇష్టమొచ్చినట్లుగా పేర్లను మార్చుకుంటూ దేశ ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా దేశ ప్రజల మనోభావాలను గౌరవించి ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును జోడించాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఎస్‌కె కాశిం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సీపీఐ కాంగ్రెస్ నాయకులు ఆర్డీవో వై శివరామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె మహబుబ్‌వలి, సీపీఐ నాయకులు గుండాల కాశయ్య పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి శ్రీనివాసరామానుజన్

ప్రధానోపాధ్యాయుడు జగన్

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలం జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కశ్శెట్టి జగన్ బాబు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికీ జగన్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు జగన్ మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని అన్నారు. తమిళనాడులోని ఈరోడ్లో ఓ నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కోమలమ్మల్, శ్రీనివాస అయ్యంగారి దంపతులకు 1887 డిసెంబర్ 22న రామానుజన్ జన్మించారని తెలిపారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను ప్రదర్శించి ఆయిలర్ నియమాలు, త్రికోణమితికి చెందిన సమస్యలను సాధించారని చెప్పారు. మన దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన రామానుజన్ అనారోగ్యంతో తన 33వ ఎట అనగా ఏప్రిల్ 26 1920 సంవత్సరంలో కన్నుమూశారని తెలిపారు. గణిత శాస్త్రంలో రామానుజన్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఎం అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా షేక్ మాబుసుభానీ

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్ మాబు సుభాని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు పదవి బాధ్యతలు చేపట్టారు. వీఆర్వోలు రెవిన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాబు సుభాని మద్రిపూడి మండలం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతపై సంత నూతలపాడు కు రెగ్యులర్ డిటిగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన డిటి మాబు సుభానిని రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్ తేజ్ రాష్ట్ర విఆర్వోల సంఘం ఉపాధ్యక్షులు కె రవికుమార్ జిల్లా వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి ఏసి ఆదిరెడ్డి మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎం శ్రీనివాసులు వీఆర్వోలు మరియ కుమార్ హనుమంతరావు జాలయ్య వెంకటస్వామి దాసరి శ్రీనివాసులు వినీల తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు సోమవారం జరిగిన పిజి ఆర్ ఎస్ గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు వచ్చినట్టు తాహసీల్దార్ ఎస్ ఎల్ నారాయణరెడ్డి తెలిపారు. సర్వే కొలతకు ఒకటి ఆక్రమణలు నివారణకు మరొకటి అర్జీలు ప్రజల నుండి వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్ బాబు ఎంఈఓ డి.వెంకా రెడ్డి ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి మండల హౌసింగ్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు పరిశీలన

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ప్రత్యేక మండలంలోని మైనంపాడు హైస్కూల్లో నందు సోమవారం జరుగుతున్న ప్రత్యేకఆధార్ క్యాంపును మండల డిప్యూటీ ఎంపీడీవో జీఎస్ డబ్ల్యు ఎస్ ఆఫీసర్ పి రవికుమార్ పరిశీలించారు. ఆధార్ పెద్ద విద్యార్థులకు డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్ పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఇంచార్జ్ హెచ్‌ఎం హనుమాచారి పంచాయతీ అభివృద్ధి అధికారి ఆవులయ్య పాల్గొన్నారు.

యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

విశాలాంధ్ర - బేస్తవారిపేట : యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకునే పవిత్ర క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రతి కుటుంబంలో శాంతి, ప్రేమ, ఆనందం, సౌభ్రాతృత్వం నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కేకును కట్ చేసి, క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పునూరు భూపాల్ రెడ్డి. మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సైదులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొట్టం ప్రసాదు, ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర, కొల్లూరు : పేద విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందించి వారి జీవితాలలో వెలుగులు నింపాలన్న ఉద్దేశ్యంతో న్యూలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ పునస్కరించుకొని పేద, వెనుకబడిన తరగతుల చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ గుండాల రవి తెలిపారు. సోమవారం కొల్లూరు జగజ్జీవన్‌రామ్ కాలనీలో సు మారు 30 మంది చిన్నారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి గుండాల మోహనరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

మండల స్థాయి స్పెల్‌బీ పోటీలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండల స్థాయి స్పెల్‌బీ పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. అతిథులుగా ఎంఈవోలు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్ హాజరైయ్యారు. ఈ పోటీలలో చవిటిపాలెం, మిన్నెకల్లు, కొప్పరం, సంతమాగులూరు, ఏల్చూరు, కొమ్మలపాడు పాఠశాలలకు చెందిన 6,7,8,9వ తరగతి విద్యారులు పాల్గొన్నారు. 6వ తరగతిలో షేక్ మైమున్నీ (కొమ్మలపాడు) 7లో జె.చరణ్, 8లో షేక్ జాస్మిన్ ఏల్చూరు, 9లో పి.చంద్రిక చవిటిపాలెం విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు గడువులోపు పరిష్కరించాలి

కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : పీజీ ఆర్ఎస్ అర్జీలు గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు,సిబ్బందితో స్థానిక న్యూ విసి హాల్‌లో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ సేవలు సచివాలయాలు,మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి వెళ్లేలా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు.వంద సేవలు మాత్రమే ప్రస్తుతం అందుతున్నాయని,మరిన్ని సేవలు అందుబాటులో ఉన్న విషయాలపై అవగాహన కల్పించాలన్నారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు,గ్రామ పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఇందు కొరకు ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి,విచారించాలన్నారు.ప్రజలకు మేలు జరగడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు.ఆ దిశగా కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు.నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగించేందుకు సచివాలయాలలో ప్రత్యేకంగా అర్జీలు నమోదు చేయించాలన్నారు.ఐ-జిఓటి,ఈ శ్రమ పోర్టల్ నమోదు కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించడానికి అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఎప్పటికప్పుడు వివరాలు పంపాలన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్న విషయాలపై రైతులు, ప్రజలకు వివరాలు తెలియపర్చాలన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,ఉప కలెక్టర్ లవన్న,మెప్మా పిడి ఆనందసత్యపాల్, సిపిఓ షాలేము రాజు,కార్మిక శాఖ అధికారి వెంకట శివప్రసాద్,పౌర సరఫరాల సమస్త మేనేజర్ శ్రీలక్ష్మి,కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధిహామీ పథకం కొనసాగించాలి

- జిరాంజీ పేరును ఎత్తివేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వికసిత్ భారత్ గ్యారెంటీ పేరుతో పేదల పొట్టికొట్టే మరణ శాసనని వెనక్కి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ప్రభుత్వాలు ప్రతి ఉపాధి హామీ కార్మికులకు ఇవ్వాలని ప్రజాసమస్యల పరిష్కర వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌కు వామ పక్ష నాయకులతో కలసి డిమాండ్లతో ఉన్న మెమోరాండం అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో పది వామపక్షాల పార్టీల పిలుపుమేరకు బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పాత విధానాన్ని కొనసాగించాలన్నారు.జిరాంజీ పేరును ఎత్తివేయాలని 200 రోజులు పని దినాలు కల్పించాలని 600 రోజు వారి కూలి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరి 90 శాతం నిధులు కేటాయించాలన్నారు.60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్రం విధానాన్ని రద్దు చేయాలన్నారు.సుప్రీంకోర్టు చెప్పిన విధంగా నెలకి రూ.26,000 వచ్చే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలన్నారు.ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకుందాం పేదల హక్కులు కోసం పోరాడుదమాని ఆయన పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ జీ రాంజిగా మార్చడానికి జీవో తీసుకు రావడంపై ఆయన తీవ్రంగా ఖండించారు.భారత రాజ్యాంగం ద్వారా ఆగస్టు 25 వ తేదీన 2005వ సంవత్సరములో అమలులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిందని ఈ చట్టాన్ని రద్దు చేసే కేంద్ర ప్రభుత్వ కుట్ర నశించాలన్నారు.ఉపాధి హామీ పథకం పేరును మార్చడం వలన ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని గ్రామాలలో ఉపాధి పథకాన్ని సక్రమంగా అమలు చేసి వలసలను నివారించాలన్నారు.సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు.మహాత్మా గాంధీ పేరు మార్పు వలన ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు శోభారాణి, మేకల ప్రసాదు,సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ కృష్ణమోహన్,సిపిఐ నాయకులు డి.నాగేశ్వరరావు వైదన వెంకట్,సిపిఎం నాయకులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వలు తనిఖీ

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో ఎరువుల వ్యాపారం చేయుచున్న పూనురు పి.ఏ.సి.యస్, ప్రవేటు డీలర్ షాపులను అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకులు ఇంటర్నల్ స్క్వాష్ అధికారి బి.ఎఫ్రాయిం తనిఖీ నిర్వహించారు. షాపులు ఎరువులు నిల్వలు, ఈ పాస్ విషన్‌లో ఎరువుల నిల్వలు పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసే రైతులు తప్పక రసీదులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వి.పి కుమారి, పిఎసిఎస్ కార్యదర్శి లక్ష్మయ్య, ఎపిసిఎస్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మార్వో

విశాలాంధ్ర - చినగంజాం : చినగంజాం ఎమ్మార్వో కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎమ్మార్వో ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ప్రభాకర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.చినగంజాం మండల పరిధిలోని ప్రజలుకు ఏ సమస్య ఉన్న ప్రజలు అర్జీ ద్వారా నేరుగా తన దృష్టి తీసుకొస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజల నుండి మూడు అర్జీలు వచ్చినట్టు ఎమ్మార్వో ప్రభాకర్ తెలిపారు.అర్జీల ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి, గణితశాస్త్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రధానం చేశారు.ఈనెల 20వ తేదీన చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో గణిత శాస్త్రంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలలో మండలంలోని అన్ని పాఠశాలల నుండి విద్యార్థులు పోటీలో పాల్గొనగా రేణింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి బి.అవినాష్ అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా,ద్వితీయ స్థానం కొండమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.ధన్యశ్రీరెడ్డి సాధించగా,తృతీయ స్థానంలో ఇదే పాఠశాల విద్యార్థిని ఎం.జాహ్నవి నిలిచారు.వీరికి మాథ్స్ డే సందర్భంగా సోమవారం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్లపల్లి వీరనారాయణ ప్రథమ బహుమతిగా రూ.5000లు,ద్వితీయ బహుమతిగా రూ.3000లు,తృతీయ బహుమతిగా రూ.2000లు నగదు బహుమతులతో పాటు మేమెంటోలు,మెరిట్ సర్టిఫికేట్లును విద్యార్థులకు అందించారు.ఈ సందర్భంగా మొదటి స్థానం సాధించిన రేణింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు రావి చంద్రశేఖర్‌ను ట్రస్ట్ సభ్యులు,చందలూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్ కిషోర్ సేవలు మరువరానివి



విశాలాంధ్ర - రేపల్లె : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు-రిటైర్డ్ అధ్యాపకుడు మన్నవ రాజ్ కిషోర్ సేవలు మరువరానివని పూర్వ విద్యార్థులు రాజ్ కిషోర్ సేవలను కొనియాడారు.గతంలో రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూ, ప్రభుత్వ గిరిజన బాయ్స్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెబుతూ,ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ సంస్థ ఏఈఎల్‌సిలో సెక్రెటరీగా ఉంటూ వెనుకబడిన పలు గ్రామాలలో ఏఈఎల్‌సి ద్వారా ప్రార్థన మందిరాలు నేర్పించి గ్రామాలలో మంచి పేరు ప్రఖ్యాతలు పొందారు.అనంతరం తెనాలి-చినరావూరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలను ప్రారంభించి వివిధ గ్రామాల్లోని అనేక పేద విద్యార్థులకు ఈ కళాశాలలో హాస్టల్ వసతి కల్పించి విద్యాబుద్ధులు నేర్పిన ఘనత ఆయనకే దక్కుతుందనారు.ఇలాంటి మంచి మనసున్న మన్నవ రాజ్ కిషోర్ సేవలు విద్యార్థుల గుండెలలో స్థిర స్థాయిగా నిలిచిపోతాయని కళాశాలలో విద్య నేర్చుకున్న పూర్వ విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.విద్యారంగానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ఎన్జీవో హోం ఎదురుగా శ్రీవెంకట బావపురి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాపట్ల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలకి ముఖ్య అతిథులుగా బాపట్ల పట్టణ సిఐ ఆర్ రాంబాబు,బాపట్ల సబ్ రిజిస్టర్ జాన్ మోహన్‌లు హాజరై కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.దైవ సేవకులు చింత యేసు రత్నం దేవుని వాక్యం అందించి అసోసియేషన్ కొరకు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకట భావపురి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తోట కృష్ణమూర్తి,బుర్ర ఆంజనేయులు,దర్శి ఇబ్రాయిల్,కార్యదర్శి ముప్ప రమేష్ బాబు,ఉపాధ్యక్షులు నర్రా శ్రీనివాసరావు,సహాయక కార్యదర్శి షేక్ సుభాని,ట్రెజరర్ ఒంగోలు రత్తయ్య,కార్యవర్గ కమిటీ సభ్యులు కటికల మోజేష్,అదే వంశీ,పాలెం సుబ్బయ్య,పనింద్ర,తగాకుల సూర్య,మహమ్మద్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. బాలాజీ

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్రంలో చేనేత కార్మికులు,సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ విమర్శించారు.సోమవారం భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారు మెరుగైన జీవనాన్ని గడిపే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పరిశ్రమ రక్షణను మరచిందని బాలాజీ ఆరోపించారు.చేనేత సహకార సంఘాలకు వివిధ రాయితీల రూపంలో చెల్లించవలసిన బకాయిలను చెల్లించకపోవడంతో సహకార సంఘాలు కొన ఊపిరితో కొనసాగుతూ కార్మికులకు ఉపాధి కల్పించలేని దుస్థితికి చేరుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కార్మికుల సంక్షేమం,సహకార సంఘాలను కాపాడుకునేందుకు,వృత్తి రక్షణకై చేనేత సంఘాల ఆధ్వర్యంలో జనవరి 4వ తేదీ రాష్ట్రవ్యాపిత రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవాడలో నిర్వహించేందుకు ఆదివారం గుంటూరు గుజ్జనగుండ్లలోని ప్రగడ కోటయ్య వీవర్స్ భవనంలో ప్రముఖ న్యాయవాది,చేనేత ఉద్యమ నాయకులు వై.కె ఆధ్వర్యంలో జరిగిన చేనేతల సమావేశంలో నిర్ణయించడం జరిగిందని బాలాజీ తెలిపారు.కూటమి ప్రభుత్వం చేనేతల సమస్యల పరిష్కారానికి సహకార సంఘాల రక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని బాలాజీ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు,కె.వీర మోహన్‌రావు,ఏఐటియు సి.నాయకులు బందారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోక్షిక జన్మదిన వేడుకల్లో అశోక్ కుమార్

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగడ్డ ఆంజనేయులు మనవరాలు మోక్షిక జన్మదిన వేడుకకు అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరై చిన్నారి మోక్షికను ఆశీర్వదించారు. మండల పార్టీ కన్వీనర్,స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ క్విజ్ పోటీల్లో రాంబట్లపాలెం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : విద్యార్థులలో నిగూఢీకృతమైన ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి పులి లాజర్ అన్నారు. సోమవారం చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని విద్యార్థులకు నిర్వహించిన స్పెల్ బి పోటీలలో రాంబట్లపాలెం విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.జూనియర్ విభాగంలో వి.వర్షిత, ఎల్.యువజ్యోతి ప్రథమ స్థానాన్ని పొందారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఇంటూరు సీతారామయ్యను విద్యాశాఖ అధికారి తురిమెళ్ళ నవీన్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారావు అభినందనలు తెలిపారు.

సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.దైవ కుమారుడు మానవ రూపంలో అవతరించిన పర్వదినాన్నే క్రిస్మస్ పండుగగా జరుపుకుంటామని కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు ఈ సందర్భంగా తెలిపారు.ప్రేమ,శాంతి, సేవాభావాన్ని ప్రతిబింబించే క్రిస్మస్ సందేశాన్ని విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎం.శ్రీమన్నారాయణ,హెచ్ఆర్ఎం అసోసియేట్ డీన్,ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, ఎక్స్ఎల్ఆర్ఐ ఢిల్లీ ఎన్సీఆర్ క్యాంపస్ హాజరయ్యారు.కళాశాల రిటైర్డ్ లైబ్రేరియన్ పుల్లగూర జయాశీలరావు అధ్యక్షత వహించగా,కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సెయింట్ జాన్ ప్యారిస్ సంఘ కాపరి చంద్రకాంత్ దైవ సందేశాన్ని అందించి,క్రిస్మస్ పండుగ ప్రాధాన్యతను వివరించారు.ముఖ్య అతిథి ప్రొఫెసర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వారికి భారం కాకుండా స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని,ఆ లక్ష్య సాధనలో నిరంతరం కృషి చేసి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.ఎన్నో సంవత్సరాల తరువాత మళ్లీ విద్యార్థులతో కలిసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.అనంతరం క్యాండిల్ సర్వీస్ నిర్వహించి,కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథిని శాలువా,పూలమాలలు,బొకే అందించి ఆత్మీయంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది షిపోరా,డాక్టర్ గారపాటి మంజుల,సుమ,చిన్నపాప,షీలా,పార్వతి,కృష్ణవేణి,గాస్పర్,రవిచంద్ర,అధ్యాపకేతర సిబ్బంది వినీల,నీలిమ,జార్జి విన్సెంట్,జ్యోతి,లక్ష్మయ్యతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మాణరంగంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నిర్మాణ రంగంలో ఇంజనీర్లదే కీలక ప్రాధాన్యత అని క్లేసా ఏపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి అన్నారు.క్లేసా జిల్లా యూనియన్ సమావేశాన్ని బాపట్ల పట్టణంలో నిర్వహించారు.ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో అనుమతుల కోసం ఇంజనీర్లు పోషించే పాత్ర ఎంతో విలువైనదని అటువంటి వారికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.ఇప్పటికే అనేక సమస్యలను మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి,డిటిసిపి దృష్టికి తీసుకువెళ్లగా కొన్ని పరిష్కారం అయ్యాయని, మరికొన్ని పరిష్కారం అవ్వాల్సి ఉందన్నారు. క్లేసా యూనియన్ స్థాపించిన ఆరు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఈ యూనియన్‌లో ఉన్న ప్రతి సభ్యుడికి ఎటువంటి సమస్యలు ఇబ్బందులు ఎదురైనా క్లెస్సా యూనియన్ అండగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుందర్ రాజు, కార్యదర్శి మూర్తి,బాపట్ల జిల్లా నాయకులు, హనుమంతరావు, విశ్వనాథ్,సుబ్బరాయుడు, రోశయ్య ,శ్రీకాంత్, భాష, షణ్ముఖ,సుబ్బారావు,అనిల్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని ఎరువులు,పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ పర్చూరు ఏడీఏ జీబీపీ ప్రవీణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా గూడెంలో ఉన్న ఎరువుల నిల్వలతో పాటు పురుగు మందుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువులు, ప్రభుత్వం ధరలు కంటే ఎక్కువగా ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మండల ఏవో షేక్ సైదా పాల్గొన్నారు.

నేడు బాపట్లకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో జిల్లా ఇంచార్జి మంత్రి,రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం ఒక్క రోజు జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.గత సంవత్సరంలో రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో బాగంగా జిల్లాలో నిర్వ హించిన మెగా పేరెంట్స్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గ్రాంట్ సి యం ఎష్యురెన్స్,పియంశ్రీ రూ.148. 80o64.70 లక్షలతో నూతనంగా నిర్మించిన పురపాలక ఉన్నత పాఠశాల భవనంను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర వర్మ,యం.పి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌తో కలసి మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారని కలెక్టర్ అప్రకటనలో తెలిపారు.

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర -చినగంజాం : చిన్నగంజాం మండలం వెలుగు డిఆర్డి ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద 164 మందికి రెండు కోట్లు రుణాలు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.ఈ చెక్కులు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పొద వీరయ్య,ఎంపీడీవో ధనలక్ష్మిలా చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.మండల అధ్యక్షులు వీరయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి ఎస్సీ,ఎస్టీలకు విరివిగా రుణాలు ఇవ్వటం చాలా సంతోషకరంగా ఉంది అని ఈ రుణాలను అందరూ సక్రమంగా వినియోగించుకొని ఎక్కువ రుణాలు పొందితట్టుగా ఉండాలని కోరారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలోని అత్యధికంగా ఎస్సీ,ఎస్టీకు సబ్ ప్లాన్ ఇప్పించడంలో మండలం సీసీలు వివోఏలు బాగా పని చేశారన్నారు.ఈ సంవత్సరము ఎస్సీ 124 మందికి ఎస్టి 40 మందికి ఈ సబ్ ప్లాన్ నిధులు అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, పెదగంజం సుబ్బారెడ్డి,నీలాయపాలెం సర్పంచ్ శీను,సత్యం,శారదమ్మ,సీసీలు స్వామి,శ్రీలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

యాంత్రీకరణ వరి కోతకే రైతుల మొగ్గు

విశాలాంధ్ర - నిజాంపట్నం : కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి.సంప్రదాయ పద్ధతుల నుంచి రైతులు యాంత్రీకరణ వైపు మళ్లుతున్నారు.ముఖ్యంగా యంత్రాల వరి కోత వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.దీని వల్ల సమయం ఆదా కావడం, కూలీల ఖర్చులు తగ్గడం,వ్యవసాయంలో పెరుగుతున్న వ్యయ భారం తగ్గుతుంది.కూలీల కొరత,పెరుగుతున్న వేతనాలు వంటి సమస్యలను అధిగమించడానికి హార్వెస్టర్ల యంత్రాలను ఉపయోగించడం వల్ల ఖర్చు తగ్గి,లాభదాయకత పెరుగుతుందని అన్నదాతలు భావిస్తున్నారు.కూలీలతో వరి కోత చేపడితే ఎకరాకు కోతకు రూ.3 వేలు,ఓదెలకు రూ.800,కుప్ప వేసేందుకు రూ.3500,నూర్పిడికి రూ.5 వేలు వంతున ఖర్చు అవుతోంది.ఈ మొత్తం ఖర్చుతో పోలిస్తే యంత్రంతో కోతకు సుమారు రూ.4 వేలు వరకు మాత్రమే ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.దీంతో భారీగా వ్యయ భారం తగ్గుతోందని రైతులు అంటున్నారు.మొత్తంగా కూలీల కొరతను అధిగమించి, ఖర్చులను తగ్గించుకోవడానికి యంత్రాల వినియోగం పెద్ద ఉపశమనంగా మారిందని రైతులు చెబుతున్నారు.యంత్రాలతో కోత, నూర్పిడి వంటి పనులు వేగంగా పూర్తవుతుండటంతో పాటు, ధాన్యం వెంటనే విక్రయించే అవకాశం లభిస్తోందని,అందుకే ఎక్కువ శాతం మంది రైతులు యంత్రాలతో కోతకు ఆసక్తి చూపుతున్నారు.అయితే యంత్రాలతో వరి కోత కోయడం వల్ల పశుగ్రాసానికి ముప్పు వాటిల్లుతుందని,గడ్డి దొరకడం కష్టమవుతుందని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మొత్తంగా చూస్తే యాంత్రీకరణ వల్ల లాభాలే ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.ఆధునిక వ్యవసాయంలో ఇది ఒక ముఖ్యమైన మార్పుగా చెప్పవచ్చు అని రైతులు అభిప్రాయపడుతున్నారు.

యూపీ పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని వద్దిమడుగు గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తాళ్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ,సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గ్రామస్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసూన, దేవి ప్రసాదరావు, పద్మజ నందిని ,భార్గవి మల్లయ్య విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర-కొమరోలు : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత శాస్త్రవేత్త, మేధావి, శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను వివిధ పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె.శివ నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గణితాన్ని సులభతరంగా నేర్చుకోవాలని, శ్రీనివాస రామానుజన్ మనందరికీ ఆదర్శమని అన్నారు.గణిత ఉపాధ్యాయులు యమ్ రఘురామి రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని అన్నారు. విద్యార్థినీ ,విద్యార్థులు అందరూ గణితాన్ని ఇష్టంగా నేర్చుకునే ప్రయత్నం చేయాలని, ఉపాధ్యాయ సహకారంతో భావి గణిత శాస్త్రవేత్తలు అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు మరియు క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలు అందరికీ బహుమతులను అందజేశారు. గణిత ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు స్వీట్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ శ్రీనివాసులు,కె రాజశేఖర్,ఎ విశ్వరూపం, టి.విజయ నిర్మల, ఎన్ మహేందర్ రెడ్డి, ఎం రమేష్ బాబు, సునీత, అరుణ్ కుమార్ బోధనే తర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటక రంగం బాపట్ల జిల్లా అభివృద్ధికి కీలకం

విశాలాంధ్ర - బాపట్ల : పర్యాటక రంగం బాపట్ల జిల్లా అభివృద్ధికి కీలకం కానుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.తన పరిధిలో ఉన్న వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలన,మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులకు పురమాయించారు.పర్యాటక రంగం సంరక్షణ, స్వచ్ఛత చాలా ప్రాముఖ్యమని కలెక్టర్ చెప్పారు. అధికారులందరూ సమష్టిగా పనిచేస్తేనే జిల్లా అభివృద్ధిపై మంచి ఫలితాలు వస్తాయన్నారు.అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు.బాపట్ల జిల్లా పర్యాటక రంగంగా అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. సూర్యలంకలో అభివృద్ధి పనులు ఇప్పుడే మొదలయ్యాయన్నారు.భూమి కేటాయింపుపై సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అధికారుల పనితీరు అభినందనీయమన్నారు.బీచ్‌ల వద్ద ప్రతి సోమవారం పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక డ్రైవ్ జరగాలన్నారు.పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.పీజీఆర్ఎస్ అర్జీలపై విచారణ,తనిఖీ జరగాలన్నారు.వ్యక్తి శాఖలో 150 పెండింగ్లో ఉండగా,వివిధ శాఖల్లో పెండింగ్ అర్జీలను పరిష్కరించాలని అధికారులకు చెప్పారు.అలాగే మండల స్థాయిలో అద్దంకి మండలంలో 760 అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు.అన్ని అర్జీలను చిత్తశుద్ధితో తక్షణమే పరిష్కరించాలన్నారు.జిల్లా రెవిన్యూ అధికారి 3,600 ఇ-ఫైల్స్ చేశారని అభినందించారు.ఐదు శాఖల జిల్లా అధికారులు ఇంతవరకు ఇ-ఫైల్స్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు.ప్రతి కార్యాలయం నుంచి ఇ-ఫైల్స్ విధానాలనే దస్త్రాలు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట,డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్,ఉప కలెక్టర్ లవన్న, గుంటూరు డిప్యూటీ సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి:జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువ తకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరి గిన మెగా జాబ్ మేళాకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రాష్ట్రానికి గొప్ప పరిశ్రమలను తీసుకు వచ్చి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తు న్నారని అన్నారు. ఇప్పటికీ 13 లక్షల కోట్లు పెట్టు బడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. తద్వారా రాష్ట్రంలో 16 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు తెలిపారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నాడు జగన్ రెడ్డి యువ తను మభ్యపెట్టి ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా దగా చేశారన్నారు. అందుకే వైసిపికి యువత తగిన విధంగా బుద్ధి చెప్పారని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకువచ్చి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు. ఎన్నికల ముందు యువతకిచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీని ఇచ్చి 16 వేలకు పైగా టీచర్ ఉద్యో గాలను కూటమి ప్రభుత్వం నియామకం చేసింద న్నారు. యువత పట్ల సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయన నిరంతర శ్రామికుడిలా పనిచేస్తున్నారని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజి రావు మాట్లాడుతూ ఈ జాబ్ డ్రైవ్‌కు 34 కంపెనీలు హాజరు కాగా 1452 మంది హాజరయ్యారని, 445 మంది ఏంపిక అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా, నిశ్శంకర శ్రీనివాస రావు, బొంకూరి రోశయ్య, పీవీ సురేష్ బాబు, పత్తి పూర్ణ, షమీమ్ ఖాన్, జానీ పాల్గొన్నారు.

పేదల వైద్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్

విశాలాంధ్ర - వినుకొండ : పేదల వైద్యానికి ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. వారు మాట్లాడుతూ పేదవాడికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం 1334 మంది లబ్ధిదారులకు 9.15 కోట్లు సీఎం సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు చెక్కులు అందజేయటం జరిగిందన్నారు. ఆరుగురికి అత్యవసర వైద్యం నిమిత్తం ఎల్ఓసిలు ఇవ్వడం, 42 మందికి 28.30 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేయటం సంతోషకరమన్నారు. పేదలకు కార్పోరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు తగిన ఆలోచనలు చేస్తున్నాడని అన్నారు. మెడికల్ కాలేజీల కొనసాగింపులో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. రాజకీయ స్వార్థం కోసం వైసిపి నిరాధారణమైన విమర్శలు తగవన్నారు. జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఏపి ఇరిగేషన్ డెవలప్మెంట్ సభ్యులు పెమ్మసాని నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ షకీలా దస్తగిరి, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు బొంకూరి రోశయ్య, కర్నాటి వెంకటరెడ్డి, పత్తి పూర్ణ, పివి సురేష్ బాబు, ఆర్ వీరాంజనేయరెడ్డి, ముత్తినేని కొండలు, నర్రా కిషోర్, జనసేన జిల్లా నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆటో ప్రారంభం

విశాలాంధ్ర - దాచేపల్లి : నిస్వచ్ఛేంద్ర కార్పొరేషన్ అందించిన ఈ ఆటోను ముత్యాలంపాడు గ్రామంలో సోమ వారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఎంపీడీఓ ఉల్లంగుల వెంఖటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీ ఓలు గీతా లలిత కుమారి, భీమవరపు సాంబిరెడ్డి,. సచివాలయ అధికారులు, ఉద్యోగులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసరామానుజన్ జయంతి

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని సాయినగర్ రామన్నపేట హరిజన్ పబ్లిక్ స్కూల్‌లో భారతీయ గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ పి. రవికుమార్ మాట్లాడుతూ రమానుజన్ జీవితం తక్కువకాలమే అయినప్పటికీ గణిత శాస్త్రానికి సుమారు 3700కు పైగా కొత్త సమీకరణాలు ఫలితాలు అందించి ప్రపంచ గణిత మేధావులను ప్రముఖంగా కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఆచార్యులు హార్డీని అబ్బురపరిచారన్నారు. ఈ సందర్భంగా స్కూల్‌లో తయారు చేసిన వివిధ గణిత శాస్త్ర ఆధారిత పరికాలు ప్రదర్శనగా ఉంచగా అందరినీ ఆకట్టుకున్నాయి. గణితశాస్త్ర ఉపాధ్యా యులు లిలిత విధ్యార్థులను ప్రొత్సహించగా గణి తంపై ఆసక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విధ్యార్థు లకు డాక్టర్ పి.రవికమార్ బహుమతులు అందజేశారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

విశాలాంధ్ర - పర్చూరు : జీవిత గమనానికి గణితం ప్రాధాన్యత సంతరించుకుందని మండల విద్యాధికారులు శివకోటేశ్వరరావు, వెంకటరామయ్య తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గణిత ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. గణితం ఉపాధ్యాయుడు సుబ్బారావును ప్రసంసిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోదుగుల నాగిరెడ్డి, ఈదర రాజశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

యుద్దనపూడిలో...

విశాలాంధ్ర - యద్దనపూడి : యద్దనపూడి ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని అన్నీ పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస రామనుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం దేవేంద్రరావు మాట్లాడుతూ ప్రపంచ గణిత శిఖరాలపై భారతదేశ కీర్తిని చాటి చెప్పిన మహనీయుడు గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ అంటూ కొనియాడారు. గణిత ఉపాధ్యాయుడు తూర్లపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తదిశ్వాస వరకు గణిత అంకెలపై శ్రీనివాసరామనుజన్ ప్రయోగాలు చేశారన్నారు. రామనుజన్ రూపొందించిన గణిత సిద్ధాంతాలపై నేటికి ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు వివిధ రకాల ముగ్గులు వేశారు. అన్నీ పాఠశాలల గణిత క్విజ్‌లు గణిత మేళాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - రేపల్లె : క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని రేపల్లె ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఇసుక పల్లిలో సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేకును కట్ చేసి విచ్చేసిన అతిథులకు పంచిపెట్టారు.అనంతరం సెమి క్రిస్టమస్ సందేశాన్ని పాస్టర్ సామ్యూల్, మాస్టర్ రాజారత్నం,సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు,అసోసియేషన్ ప్రెసిడెంట్ దర్శి భాస్కర్ రావులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబటి జాకోబ్,దోవ.రవి, కృపారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుళ్లపల్లిలో...

విశాలాంధ్ర - చెరుకుపల్లి : చిన్ననాటి నుండి కలిసి మెలిసి చదువుకొని వివిధ ఉద్యోగాలలో, వ్యాపారాలలో స్థిరపడిన వ్యక్తులు ఆదివారం తన స్వగ్రామమైన గుళ్లపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.టీం ఫోనిక్స్ పేరుతో ఒక గ్రూపుగా ఏర్పడిన వీరు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కలిశారు.పండుగ సందర్భంగా కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కరుకుట్ల కిరణ్, దగ్గుమల్లి మెర్సిన్న్ బాబు, ఓగిరాల కృష్ణ ప్రసాద్, దగ్గుమల్లి వంశీనాథ్,సాయినాథ్,తల తోటి కమల్నాథ్, వల్లూరి శ్రీనివాసరావు,మంచాల విక్రాంత్, కోప్పూరి అనిల్ బాబు, మిక్కిలి రాజేష్ బాబు, బోలగాని హరికృష్ణ,పెరికల జీవన్ బాబు, దోమ తోటి లక్ష్మణ్ కుమార్,దగ్గుమల్లి రవి పాల్గొన్నారు.

మహిళా మండలి,పి.యు ఆధ్వర్యంలో....

విశాలాంధ్ర -చీరాల : మహిళా మండలి- పి.యు ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.సర్వ మానవాళి పాప పరిహారార్థం దైవ కుమారుడు యేసుక్రీస్తు మానవరూపంగా భూమిపై అవతరించిన పర్వదినమే క్రిస్మస్ అని,ఈ పండుగ శుభాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందాలని మహిళా మండలి వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి జె.ఎల్ లక్ష్మి పద్మావతి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాన్ని మహిళా మండలి,ఆశరేఖ మహిళా మండలి సి.బి.ఓ అధ్యక్షురాలు ఎన్.నాగేంద్రమ్మతో పాటు వారి బృందం నిర్వహించారు.వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని పంచుకున్నారు.కార్యక్రమానికి ముందుగా ఆర్.శ్రీనివాసరెడ్డి క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం స్టాఫ్ కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం చివరలో పాల్గొన్న వారందరికీ ఫ్రూట్స్,స్వీట్స్ పంపిణీ చేశారు.శాంతి,సౌభ్రాతృత్వ సందేశంతో సెమీ క్రిస్మస్ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో సి.బి.ఓ సభ్యులు పి.పార్వతి,జయమ్మ,శందిని,చిన్ని, ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరావు,ఏఓ లలిత,ఏఎన్ఎం సీయోనుకుమారి,ఓ.ఆర్.డబ్ల్యు.ఎస్ విజయ్‌బాబు ,సంధ్యారాణి,దానమ్మ,శ్రీగీత,శిరీషరాణి,జ్యోతి,దివ్య బాను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ కార్యాలయంలో....

విశాలాంధ్ర - నిజాంపట్నం : యేసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయం అని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) జి.భాస్కరరావు అన్నారు.సోమవారం నిజాంపట్నం మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖ డీఈఈ ఎన్.సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ కేకును ఈఈ జి.భాస్కరరావు కట్ చేసి విద్యుత్ శాఖ అధికారులకు,సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం మండల విద్యుత్ శాఖ ఇంచార్జి ఏఈ గోపి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ బి. ఉమామహేశ్వర్

విశాలాంధ్ర -బాపట్ల : ఆన్‌లైన్ స్టాక్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ప్రజలకు సూచించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 60 మంది అర్జీదారులు కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు,ఆస్తి తగాదాలు,భూ వివాదాలు,ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని,అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు.వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీలను చట్టపరంగా వేగవంతంగా విచారించి,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని పోలీస్ అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కొంచెం అజాగ్రత్తగా ఉన్నా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు.ఆఫర్లు,అధిక లాభాల పేరుతో నమ్మించి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు.నకిలీ వెబ్‌సైట్ల ద్వారా లాభాల ఆశ చూపించి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని చెప్పారు.ప్రస్తుతం ఆన్‌లైన్ స్టాక్ పెట్టుబడుల పేరుతో మోసాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు.వాట్సాప్,టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సైబర్‌నేరగాళ్లు లింకులు పంపిస్తారని,ఆన్‌లైన్ ట్రేడింగ్,ఐపీఓలలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మిస్తారని చెప్పారు.మొదట కొంత మొత్తం డిపాజిట్ చేయించి నకిలీ ట్రేడింగ్ ఖాతాలో లాభాలు వచ్చినట్లు చూపిస్తారని,దాన్ని నమ్మి భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టించుకుని చివరికి డబ్బు విత్‌డ్రా చేయనివ్వకుండా మోసం చేస్తారని వివరించారు. వాట్సాప్,టెలిగ్రామ్‌లలో వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మోసపూరిత మాటలు నమ్మి,అత్యాశతో పెట్టుబడులు పెట్టడం వల్ల చాలా మంది తమ విలువైన డబ్బును కోల్పోతున్నారని తెలిపారు.ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయడం ద్వారా గానీ లేదా https://cybercrime.govఅని వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే,కోల్పోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ.జగదీష్ నాయక్,పీజీఆర్ఎస్ సెల్ మహిళా ఎస్ఐ లక్ష్మి రాజ్యం, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో నిర్వహించే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు.సోమవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ల అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జల్ శక్తి అభియాన్- వర్షపు నీటిని ఒడిసి పట్టు పనుల సంబంధించి నిజాంపట్నం మండలంలో పనులు తక్కువగా చేయుటకు గల కారణాలపై ఆయన ఆరా తీశారు.జల్ సంచార్ జెన్ భాగీరథి పనులకు సంబంధించి పిట్లవానిపాలెం మండలంలో 36 పనులకు గాను 17 పనులు పూర్తి అయినాయని 19 పనులు పూర్తి చేయవలసి ఉందని,పూర్తిచేసిన పనులకు సంబంధించి జెఙ్బీ పోర్టల్‌లో ఫోటోలు నమోదు చేయకపోవడం గల కారణాలపై ఆయన ఆరా తీశారు.స్వచ్ఛ ఆంధ్ర విజన్ 2047 సంబంధించి కెపిఐలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ పనుల పురోగతిపై ప్రతి సోమవారం సమీక్ష నిర్వహిస్తానని,పనుల పురోగతి ఉండాలన్నారు.రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్ క్రింద జిల్లాలోని 12 మండలాలలో 12 నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినప్పటికీ 9 భవనాలను మాత్రమే గ్రౌండ్ చేయుటకు గల కారణాలపై ఆయన ఆరా తీశారు.మిగిలిన 3 పనులను ఏడు రోజుల్లో ప్రారంభించాలన్నారు.వ్యక్తిగత కంపోస్ట్ గుంతల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో గల రామాపురం,సూర్యలంక, ఓడరేవు, పొట్ల సుబ్బయ్యపాలెం బీచ్ల వద్ద గల నివాస ప్రాంతాలలో కంపోస్ట్ గుంతలు,వ్యక్తిగత సోక్ పిట్స్,ఐహెచ్‌హెచ్,బీటీ రోడ్లు,సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని,గ్రామ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆయన అధికారులు సూచించారు. కెనాల్ ప్లాంటేషన్‌లో కొబ్బరి చెట్లను నాటాలని వాటి వలన కెనాల్ అందంగా,సుందరీకరణగా ఉంటుందన్నారు. డ్వామా పిడి విజయలక్ష్మి,పశు సంవర్ధక శాఖ జెడి వేణుగోపాల్,వీక్షణ సమావేశం ద్వారా హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు,అన్ని మండల ఏపీవోలు,హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : సినీ వినీలాకాశంలో ధ్రువతారగా స్వయంకృషితో ఎదిగిన చిరంజీవి సేవా కార్యక్రమాలలోనూ ఎందరికో స్ఫూర్తి ప్రదాత అని ఉమ్మడి గుంటూరు జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు కోట్రా నాంచారయ్య అన్నారు.సోమవారం ఆయన అభిమాన సంఘ సభ్యులతో కలిసి త్వరలో విడుదలకు సిద్ధమైన చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ పండగకు వస్తున్నాడు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన గొప్ప నటుడు పద్మ విభూషణ్ చిరంజీవి అన్నారు.ఆయన సాధించిన విజయాలు,నెలకొల్పిన రికార్డులు అందుకోవటం ఎవరికి సాధ్యం కావన్నారు.ఆయన మరిన్ని విజయాలు అందుకొని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నారు. చిరంజీవి అభిమాన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాయి వికాస్‌లో జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: జాతీయ గణిత దినోత్సవాన్ని పట్టణంలోని సాయి వికాస్ స్కూల్‌లో సోమవారం వినూత్నంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు 150 ప్రాజెక్టులను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైకుంఠపాళి విద్యార్థుల తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పాఠశాల డైరెక్టర్ ఎస్. వీరస్వామి, ప్రిన్సిపాల్ ఇ. శ్రీకాంత్, ఏ. వో. సుభాని , ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రూ.5 కోట్లతో రహదారుల నిర్మాణం

విశాలాంధ్ర- విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణ సమ యం నుంచి అభివృద్ధికి నోచుకోని విజయపురి సౌత్‌లోని మత్యకారుల సాగర్ క్యాంపు కాలనీలో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కృషితో రూ.2.6 కోట్లతో నూతన సీసీ రహదారులను నిర్మించారు. సుమారు 2.5 కీమీ మేర మత్య కారుల కాలనీ రహదారుల నిర్మాణంతో పాటు ఎయిర్ స్ట్రిప్,కుడి కాలువ బయ్యారం రహదారిని రూ. 2.4 కోట్లతో చేపట్టిన నిర్మాణం పూర్తి అయింది. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా నూతన రహదారులను ప్రారంభించనున్నారు. మత్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర-అర్ధవీడు : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని లేదంటే ప్రజలకు మోసం చేయడమే అవుతుందని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. గతంలో 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి ఎన్నికల హామీ మేరకు పెండ్లి కానుక, దుల్హన్ పథకం రూపంలో 50 వేల రూపాయలు అమలు చేసి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు చెందిన పేదలకు ఇచ్చారని, దీని ద్వారా ఈ వర్గాల పేదలకు లబ్ధి చేకూరిందని షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చి హామీ మేరకు వెంటనే దుల్హన్, పెండ్లికానుక పథకాలను ప్రారంభించి పేద ప్రజల కుటుంబాలను ఆదుకోవాలని షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. ఇలాంటి పథకాలు మరలా ఏర్పాటు చేసి పేద ప్రజలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విషయాలపై సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎజే జిల్లా అధ్యక్షులు షేక్ కాశిం, పట్టణ అధ్యక్షులు షేక్ నాగూర్‌మీరావలి, ఉపాధ్యక్షుపేలు సయ్యద్ మస్తాన్‌వలి, మాజీ పట్టణ అధ్యక్షులు షేక్ అమీర్, పట్టణ కార్యవర్గ సభ్యులు షేక్ నూర్ మహమ్మద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.